క్లుప్తంగా

దమ్ముంటే గుడివాడ, గన్నవరం నుంచి పోటీచేయాలి



గన్నవరం:దమ్ముంటే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు లోకేష్ గుడివాడ, గన్నవరంలో పోటీచేసి గెలిచి చూపించాలని ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సవాల్ విసిరారు. స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో గుడివాడలో కొడాలి నానిని, గన్నవరంలో తనను ఓడించడమే లక్ష్యమంటూ చంద్రబాబు, లోకేష్ పదే పదే చెబుతుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాజకీయ చైతన్యం కలిగిన గుడివాడ, గన్నవరం నియోజకవర్గాల ప్రజల మద్దతు నానికి, తనకు ఎలప్పుడు ఉంటుందని చెప్పారు. చంద్రబాబు చెప్పే కల్లబొల్లి మాటలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

పట్టాభిని వదిలే ప్రసక్తి లేదు....

సంకల్ప సిద్ధి మల్టీ మార్కెటింగ్ స్కీమ్ వ్యవహారంలో తనపై, కొడాలి నానిపై అసంబద్ధ, అసత్య ఆరోపణలు చేసిన టీడీపీ అధికారి ప్రతినిధి పట్టాభిరామ్‌ను వదిలే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే వంశీమోహన్ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు వచ్చిన ఆయన నుండి ఇటీవల పట్టాభిపై వేసిన పరువు నష్టం దావాకు సంబంధించి జడ్జి వద్ద స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నారు. అనంతరం ఈ కేసు వాయిదాను మార్చి 3వ తేదికి వాయిదా వేశారు. ఆ రోజు పట్టాభి కూడా కోర్టుకు హాజరుకావాల్సి ఉందని తెలుస్తోంది.

వైభవంగా మహా కుంభాభిషేకం



గన్నవరం: మండలంలోని మర్లపాలెంలో వేంచేసియున్న గంగా పార్వతీ సమేత శివలింగేశ్వరస్వామి దేవస్థానం జీర్ణోద్ధరణ అష్టబంధన మహాకుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళలు గంగా జలంతో కూడిన 108 మహా కలశాలతో మంగళవాయిద్యాల నడుమ శివపార్వతుల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

మహిళపై కేసు నమోదు

పెనమలూరు: దౌర్జన్యం చేసి బెదిరింపులకు పాల్పడిన ఓ మహిళపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం... కానూరు వైభవ్ రెసిడెన్సీలో కిలారం లక్ష్మీశిరీష కుటుంబ సభ్యులతో నివాసం ఉంటుంది. గత నెలలో ఆమె ఇంట్లో బంగారు వస్తువులు చోరీకి గురయ్యాయి. ఇంటి ఎదురుగా ఉంటున్న మహిళ పెహల్ తనను అనుమానిస్తున్నావా అని లక్ష్మీశిరీషతో గొడవపడింది. తరచుగా గొడవపడుతూ ఇంట్లోకి వచ్చి దౌర్జన్యం చేసి అంతుచూస్తానని పెహల్ బెదిరించింది. ఈ ఘటనపై బాధితురాలు లక్ష్మీశిరీష పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాద ఘటనపై...

కంకిపాడు: రోడ్డు ప్రమాదం ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని నెప్పల్లి గ్రామానికి చెందిన పాలపర్తి అనూష, తన చిన్న కుమారుడు అభినవ్ (6)తో కలిసి ఈనెల 16వ తేదీన నెప్పల్లి సెంటరులో రోడ్డు దాటుతుండగా ఉయ్యూరు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న వ్యాన్ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో అభినవ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రివిట్ ఆర్కిటెక్చర్‌పై శిక్షణ

ఉంగుటూరు:మండలంలోని తేలప్రోలు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ (సివిల్ ఇంజినీరింగ్ శాఖ) సహకారంతో రివిట్ ఆర్కిటెక్చర్‌పై ఐదు రోజుల వర్క్‌షాపును శుక్రవారం ప్రారంభించారు. సివిల్ విభాగం అధిపతి, కన్వీనర్ శివకుమార్ బాబు, కో కన్వీనర్ గిరిప్రసాద్, ఇంజినీరింగ్ ఫ్యాకల్టీ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. రివిట్ ఆర్కిటెక్చర్ అనే ఆధునాతన సివిల్ ఇంజినీరింగ్ సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కల్పించేందుకే వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలుత ప్రిన్సిపాల్, హెచ్ రిసోర్స్ పర్సన్ బ్రహ్మేష్, కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం, డైరెక్టర్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ ప్రసాద్ పాల్గొన్నారు.

శివపార్వతుల వేషధారణ పోటీలు



కంకిపాడు: శివపార్వతుల వేషధారణ పోటీలు ఉత్సాహంగా సాగాయి. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని గోసాల హెచ్‌ఎంకే పాఠశాలలో శివపార్వతుల వేషధారణ పోటీలు శుక్రవారం నిర్వహించారు. పలువురు చిన్నారులు శివుడు, పార్వతి వేషధారణతో అలరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుక్మిత్ కౌర్, డైరెక్టర్ వసంత్‌కుమార్ మాట్లాడుతూ చిన్ననాటి నుంచి దేశ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించే లక్ష్యంతో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. చిన్నారులను ఉపాధ్యాయులు అభినందించారు.

మహాశివరాత్రికి ముస్తాబైన శివాలయాలు



విద్యుత్ కాంతులతో ముస్తాబైన పేరంటాలమ్మ ఆలయం



ముస్తాబాద కొండపై శివరాత్రి ఉత్సవాలకు సిద్ధం అయిన గుహాలయం



విద్యుద్దీపాల అలంకరణలో కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం



మద్దూరు వద్ద ఏర్పాట్లపై సూచనలు ఇస్తున్న తహసీల్దార్ టీవీ సతీష్



గ్రామంలో సిద్ధమయిన ప్రభలు



మద్దూరు ఏటిపాయలో పుణ్యస్నానాలకు ఏర్పాట్లు చేసిన బారికేడ్లు

పెనమలూరు:యనమలకుదురు గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రభలు సిద్ధం చేశారు. అధికారికంగా 34 ప్రభలు ఉండగా, మరో 30 చిన్నా, పెద్ద ప్రభలు కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. దేవుడి ప్రభ శనివారం సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమవుతుంది. అనంతరం గ్రామంలో మిగతా ప్రభలు కేటాయించిన సీరియల్ నంబర్ల ప్రకారం బయలుదేరుతాయి. ప్రభలకు రంగురంగు కాగితాలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. రాతి చక్రాల రథాల పై ప్రభలు ఊరేగిస్తారు.

గ్రామంలో ప్రభోత్సవం సందర్భంగా భారీ బందోబస్తు పోలీసులు ఏర్పాటు చేశారు. ఇద్దరు అదనపు ఎస్పీలు, 8 మంది డీఎస్పీలు, 24 మంది సీఐలు, 56 మంది ఎస్ఐలు, మరో 700 మంది పోలీసు సిబ్బంది పహారా కాస్తారు. మహాశివరాత్రి ఉత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలని పోలీసులు తెలిపారు.

పుణ్యస్నానాలకు మద్దూరు ఏటిపాయ సిద్ధం ..

కంకిపాడు:మహాశివరాత్రి పర్వదినానికి మద్దూరు కృష్ణానది ఏటిపాయ ముస్తాబైంది. పుణ్యస్నానాలు ఆచరించేందుకు అనువుగా ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు పుణ్యస్నానాలకు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది 30 వేలు నుంచి 35 వేల మంది భక్తులు విచ్చేసే అవకాశం ఉందని అంచనా. శివరాత్రి సందర్భంగా పితృదేవతలకు పిండ ప్రదానాలు చేసేందుకు వీలుగా ఏటి ఒడ్డున భారీ టెంట్లను ఏర్పాటుచేశారు. పారిశుద్ధ్య వసతులు మెరుగుపర్చారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా పంచాయతీ చర్యలు తీసుకుంది. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు అనువుగా ప్రత్యేక టెంట్లను ఏర్పాటుచేశారు. పుణ్యస్నానాలు ఆచరించే భక్తులు నదిలో లోతైన ప్రాంతానికి వెళ్లకుండా బారికేడ్లను ఏర్పాటుచేశారు. నది పరిసరాల్లో హెచ్చరిక బోర్డులు ఉంచారు. పుణ్యస్నానాల సమయంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గజ ఈతగాళ్లను, పడవలను సిద్ధం చేశారు.

ఏర్పాట్లు పరిశీలన...

మహాశివరాత్రి సందర్భంగా నిర్వహిస్తున్న ఏర్పాట్లను తహసీల్దార్ టీవీ సతీష్ పరిశీలించారు. భక్తులకు కల్పించిన వసతులపై పంచాయతీ సర్పంచ్ చిప్పల రామదాసు, పంచాయతీ కార్యదర్శి చింతా కిరణ్‌కుమార్, ఇతర అధికారులతో సమీక్షించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. ప్లాస్టిక్ నిషేధం అమల్లో ఉన్న కారణంగా భక్తులు సహకరించాలని, పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునందించాలని విజ్ఞప్తిచేశారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ టీవీ సతీష్ సూచించారు.

గన్నవరం రూరల్: శివరాత్రి మహోత్సవాలకు మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న శివాలయాలు సిద్ధమయ్యాయి. ముస్తాబాద భ్రమరాంబ సమేత రామలింగేశ్వరస్వామి గుహాలయం, చిక్కవరం కొండపై ఉన్న బ్రహ్మయ్యలింగేశ్వరస్వామి దేవాలయం, సూరంపల్లి, వీరపనేనిగూడెం, తెంపల్లి, కొండపావులూరు, పురుషోత్తపట్నం శివాలయాలను ఉత్సవాలకు అలంకరించారు.

గన్నవరం: మండలంలోని శైవక్షేత్రాలు మహాశివరాత్రి పర్వదిన వేడుకలకు ముస్తాబయ్యాయి. కోనాయి చెరువు సమీపంలోని కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. శనివారం రాత్రి జరగనున్న ఆదిదంపతుల కల్యాణ మహోత్సవానికి, అన్నసమారాధనకు భారీ ఏర్పాట్లు చేశారు. కేసరపల్లిలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, శివారులోని సోమలింగేశ్వరస్వామి దేవస్థానం, దావాజిగూడెంలోని శివాలయంలో మహాశివరాత్రి పూజలు నిర్వహించనున్నారు.

రామవరప్పాడు: మహాశివరాత్రిని పురస్కరించుకుని విజయవాడరూరల్ మండలం పలు గ్రామాల్లోని శైవాలయాలు ముస్తాబయ్యాయి. రామవరప్పాడు పేరంటాలమ్మ ఆలయంలోని గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, ఎనికేపాడు పల్లాల్లోని శివాలయం, నిడమానూరు ప్రధాన గ్రామంలో ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తాగునీరు, క్యూలైన్లు వంటి తదితర సౌకర్యాలను కల్పించారు. ఈ సందర్భంగా పేరంటాలమ్మ ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి , చైర్మన్ బోయిన భాను ప్రదీప్ మాట్లాడుతూ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి 11గంటల వరకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నాభిషేకం , రాత్రి 10.30 గంటల నుంచి స్వామి వారి శాంతి కళ్యాణోత్సవం జరుగుతుందని చెప్పారు. శనివారం మధ్యాహ్నం ఆలయంలో అన్న సంతర్పణ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 19న స్వామి వారి గ్రామోత్సవాన్ని కనుల పండువగా నిర్వహిస్తామని భక్తులు విశేషంగా పాల్గొనాలని కోరారు.

సంక్షేమ పథకాలతో పేదలకు మేలు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, దీని వలన పేద, మధ్య తరగతి వర్గాలకు ఎంతో మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి తెలిపారు. కానూరు మురళీనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందచేసి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ జగనన్న పాదయాత్రలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలు గుర్తించి పథకాలు రూపొందించారని చెప్పారు. గ్రామాల్లో అర్హులైన పేదలను గుర్తించి లబ్ధిదారులుగా ఎంపిక చేసి నేరుగా బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తుందని పేర్కొన్నారు. అర్హులందరికీ పథకాలు అందిస్తున్నామని చెప్పారు.

పేదలంటే టీడీపీకి కక్ష....

పేదలంటే టీడీపీకి కక్ష అని, వారికి సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే తప్పుడు ప్రచారం చేసి ప్రభుత్వంపై బురదజల్లే యత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే పార్థసారథి ఆరోపించారు. టీడీపీ డీఎన్ఏలోనే పేదలంటే పడదన్నారు. నేడు ప్రభుత్వం పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిలుపుదల చేయాలని టీడీపీ నేతలు దమ్ముంటే బహిరంగ ప్రకటన చేయాలని సవాల్ చేశారు. టీడీపీ నేతలు రాజకీయంగా తమను ఎదుర్కోవాలని, పేదల పై కక్ష కట్టరాదని అన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు జగనన్న అమలు చేసి తీరుతాడని తెలిపారు. తాడిగడప మునిసిపల్ కమిషనర్ ఎస్. ప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నేతలు అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, తాళ్ల నరేంద్ర, వేమూరి బాలకృష్ణ, సిద్దిఖ్, నేరెళ్ల బుజ్జి, అంగిరేకుల సీతారామయ్య, అన్నే శ్రావణ్, క్రిష్టోఫర్, దాసరి వెంకటరవి, మజ్జి శివ, కాట్రగడ్డ శ్రీకాంత్, శ్రీనివాసరెడ్డి, కొనపరెడ్డి రమేష్, పెదపూడి శ్రీను, యువరాజ్, సైకం చినబాబు, వీర్ల గోపాలం పలువురు పాల్గొన్నారు.

ఎస్ఐ రాత పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

అదనపు ఎస్పీ రామాంజనేయులు



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ రామాంజనేయులు

పెనమలూరు: ఈ నెల 19వ తేదీన నిర్వహించే ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని అదనపు ఎస్పీ రామాంజనేయులు తెలిపారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం పోలీసు అధికారులు, రీజినల్ కోఆర్డినేటర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. రామాంజనేయులు మాట్లాడుతూ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలో 37 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, మొత్తం 18,452 మంది పరీక్ష రాయనున్నారని చెప్పారు. ఇందులో పురుషులు 14,876 మంది, మహిళలు 3,576 మంది ఉన్నారని పేర్కొన్నారు. పరీక్ష 19వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 1 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. కృష్ణా జిల్లాలో 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 5052 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తారని వెల్లడించారు. పరీక్ష నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. సమయం దాటిన తరువాత అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు.

ఎస్ఐ పరీక్షకు సంబంధించి ప్రశ్నాపత్రాలు శుక్రవారం కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్‌కాలేజీలోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. అధికారులు ప్రశ్నాపత్రాలను భద్రపరిచి సీల్ వేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, డీఎస్పీ విజయ్‌పాల్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

19న ప్రత్యేక ఓటరు అనుసంధాన కార్యక్రమం

విజయవాడరూరల్: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు అనుసంధాన కార్యక్రమం ఈ నెల 19న నిర్వహిస్తామని సహాయ ఎన్నికల నమోదు అధికారి, రూరల్ మండల తహసీల్దారు పి.జాహ్నవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు బూత్‌స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు . ఆధార్‌కార్డ్, పాన్‌కార్డ్, రేషన్‌కార్డ్, బియ్యంకార్డ్ , బ్యాంక్ పాస్ బుక్, పోస్ట్ ఆఫీసు సేవింగ్స్ బుక్, ఇంటిపన్ను రశీదు, మంచినీటి కొలాయి రశీదు, కరెంటు కనెక్షన్ బిల్, గ్యాస్ కనెక్షన్ బిల్, పనికి ఆహార పథకం కార్డ్, ఇంటి అద్దె రశీదు, వీటిలో ఏదైనా నివాసం తెలియచేయు పత్రము చూపించి అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలో పేరు నమోదు కోసం ఫారం 6 ను, అభ్యంతరకరమైన, అనవసరపు పేరు తొలగింపు కోసం ఫారం 7 ను, ఓటరు పేరు వగైరా వివరాలలో మార్పుల కోసం, పోలింగ్ కేంద్రం మార్పు కోసం ఫారం 8 ను వినియోగించుకోవాలన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి నిరంతర ప్రక్రియ

- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి
- రూ.38 లక్షలతో వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన



వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: గ్రామాల్లో సంక్షేమంతో పాటు అభివృద్ధి నిరంతర ప్రకియగా ఉంటుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి తెలిపారు. పెనమలూరులో రూ.38 లక్షలతో వాటర్ ట్యాంకు నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి మాట్లాడుతూ తమ ప్రభుత్వ పాలనలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేయకుండా ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిందని విమర్శించారు. పైగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేయటం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సర్పంచ్ లింగాల భాస్కరరావు, మాజీ సర్పంచ్ కిలారు వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ సునీతాశర్మ, ఏవో లోయ శివశంకర్, చోడవరం సర్పంచ్ కాకర్ల వెంకటరత్నం, వైఎస్సార్ సీపీ నేతలు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, కంచర్ల సుధీర్, మాదు శ్రీనివాసరావు, కోయ శ్రీహరిరావు, వీరంకి రాఘవులు, మరీదు నరేష్‌బాబు, తెన్నేటి ప్రకాష్, గాలంకి సుబ్బారావు, జి.శివశంకర్, శివకుమార్ పలువురు పాల్గొన్నారు. కానూరు మురళీనగర్‌లో రూ.8 లక్షలతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్డును ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ప్రారంభించారు. తాడిగడప కమిషనర్ ప్రకాశరావు, నేతలు నేరెళ్ల బుజ్జి, సిద్దిఖ్, రెహమాన్, ఖాదర్, విజయ్‌రమేష్, పలువురు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

కంకిపాడు: జిల్లా పరిషత్ నిధులు రూ. 10 లక్షలు అంచనా వ్యయంతో చేపట్టిన కమ్యూనిటీహాలు నిర్మాణ పనులను శుక్రవారం సర్పంచ్ ఆదర్శకుమార్ పరిశీలించారు.

పాఠశాలలో సదుపాయాల కల్పనకు ఎస్‌బీఐ నిధులు



సైన్స్ ప్రయోగశాలలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న సీజీఎం నవీన్‌చంద్ర ఝూ

హనుమాన్‌జంక్షన్ రూరల్:గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద నిధులు కేటాయించినట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ నవీన్ చంద్ర ఝూ తెలిపారు. నూజివీడురోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్లో రూ.6 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబొరేటరీ, డిజిటల్ క్లాస్ రూమ్, కంప్యూటర్ ల్యాబ్‌లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. సైన్స్ ప్రయోగశాలలో విద్యార్థులతో నవీన్ చంద్ర ఝూ ముచ్చటించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సీఎస్ఆర్ నిధులతో స్టేట్ బ్యాంక్ ఈ ఏడాది ట్రాన్స్‌ఫార్మేషన్ ఆఫ్ స్కూల్స్ కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో స్టేట్ బ్యాంకు ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు విద్యలో రాణించాలని కోరారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, ఎస్‌బీఐ జీఎం ఓం నారాయణ శర్మ, డీజీఎం కె.రంగరాజన్, ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సుంకర సుభాష్‌చంద్రబోస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నైపుణ్య ప్రదర్శనకు ఎఫోసిక్ చక్కని వేదిక



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాలేజీ కన్వీనర్ రాజయ్య, ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ తదితరులు

పెనమలూరు: కానూరు వెలగపూడి రామకృష్ణ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో జాతీయ స్థాయిలో ఎఫోసిక్ 2023 నిర్వహిస్తున్నామని కాలేజీ కన్వీనర్ మలినేని రాజయ్య తెలిపారు. కళాశాలలో శుక్రవారం ఎఫోసిక్ పోస్టర్ ఆవిష్కరించిన తరువాత విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 24, 25 తేదీల్లో జాతీయ స్థాయిలో సాంకేతిక, సాంస్కృతిక ఎఫోసిక్ పోటీలు ఉంటాయన్నారు. విద్యార్థులు వారి నైపుణ్యాన్ని ప్రదర్శించటానికి ఎఫోసిక్ చక్కని వేదికన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు ఆరు వేల మంది ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. వారసత్వం ప్రతిబింబించే లఘు చిత్రాలతో పాటు ,45 సాంకేతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. పోటీల్లో విజేతలకు రూ.4 లక్షలు విలువ చేసే బహుమతులు అందచేస్తామన్నారు. డీన్ బావినేని పాండురంగారావు, ఎఫోసిక్ కోఆర్డినేటర్ నరసింహం, కన్వీనర్ శ్రీదేవి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు

గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లి గ్రామంలో శుక్రవారం సర్పంచ్ కొలుసు శిరీషా ఆధ్వర్యంలో తాగునీటి బోరుకు మరమ్మతులు చేశారు. పైలెట్ ప్రాజెక్టు వెనుక ఉన్న గ్రామానికి మంచినీరు సరఫరా చేసే బోరు మరమ్మతులకు గురయింది. వెంటనే స్పందించిన సర్పంచ్ సబ్‌మెర్సిబుల్ మోటార్‌ను బాగుచేయించి నీటి సరఫరా పునరుద్ధరించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



కంకిపాడు: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జాతీయ కుష్టు నివారణా కార్యక్రమం (ఎన్ఎల్ఈపీ) జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ సూచించారు. ఉప్పలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని సచివాలయాల్లో అందుతున్న వైద్య సేవలపై పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుందర్‌కుమార్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పీహెచ్‌సీ రికార్డులను తనిఖీ చేశారు. డాక్టర్ దేవసాగర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు కుష్టు, క్షయ వ్యాధులు పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించేలా చైతన్యం చేయాలన్నారు. గ్రామాల్లో విస్తృతంగా సర్వే నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించి అవసరమైన వైద్య సహాయం అందేలా చూడాలన్నారు. వైద్యురాలు డాక్టర్ సంతోష చంద్రిక, డీపీఎంఓ శ్రీనివాసరావు, పీహెచ్ఎన్ పద్మావతి, సిబ్బంది ఆంజనేయులు, శ్యాం, మాలతి, ధనలక్ష్మి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

86 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు

నున్న(విజయవాడరూరల్): ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం నున్న గ్రామ సచివాలయం 2లో డ్రైడే-ఫ్రైడే సందర్భంగా వైద్య సిబ్బంది ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి డాక్టర్ మాధురీదేవి బీపి, షుగర్, గర్భిణులు 86 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. పాతపాడు, పి.నైనవరం,అంబాపురం గ్రామాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందచేశారు.

ఉయ్యూరులో దివ్యాంగులకు వైద్య సేవలు

ఉయ్యూరు:దివ్యాంగ చిన్నారులకు ఉయ్యూరు జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సమగ్రశిక్ష ప్రాజెక్టు అదనపు కోఆర్డినేటర్ డాక్టర్ శేఖర్ పిలుపు మేరకు శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు, పామర్రు, పమిడిముక్కల, ఘంటసాల, మొవ్వ, తోట్లవల్లూరు, మండలాలకు చెందిన 169 మంది దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ ఎస్.రాంబాబు పర్యవేక్షించారు. అసిస్టెంట్ ఐఈడీ ఏడుకొండలు, ఎంఈఓ పద్మారాణి, వైద్యాధికారి తేజస్వి, ఆడియాలజిస్ట్ వై.అనిల్, సైక్రియాటిస్ట్ శివాజీ, ఫిజియోథెరపిస్ట్ కామరాజు, మోహనబాలకృష్ణ, హెచ్‌ఎం శారద, ఐఈ రిసోర్సు టీచర్లు పాల్గొన్నారు.

నెప్పల్లిలో కంటి వైద్య శిబిరం



కంకిపాడు: వృద్ధుల కంటి సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని నెప్పల్లి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన 55 మంది వృద్ధులకు ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్ కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కంటి సమస్యలతో బాధపడుతున్న అవ్వాతాతలను గుర్తించి అవసరమైన శస్త్రచికిత్సలకు సిఫారసు చేస్తామన్నారు. ఎస్‌యుఓ శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ రాచమళ్ల శ్యాంప్రసాద్, వైద్య సిబ్బంది బిందుమాధవి, విక్టోరియా, సుబ్రమణ్యం, శ్రీధర్, సింధు పాల్గొన్నారు.

దోమకాటు వ్యాధుల నివారణపై అవగాహన

కంకిపాడు: దోమల వల్ల కలిగే వ్యాధులు నుంచి అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు సూచించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఉప్పలూరు పీహెచ్‌సీ పరిధిలోని నెప్పల్లి, ఉప్పలూరు తదితర గ్రామాల్లో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. హెల్త్ అసిస్టెంట్ రాచమళ్ల శ్యాంప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ బిందుమాధవి, సచివాలయ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, పలు గ్రామాల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.